


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

### అధ్యాయం – 7

మేఘాల్లోంచి విమానం అండమాన్ దీవులవైపు దూసుకుపోతోంటే, సీటు వెనక్కి జారబడి కళ్ళు మూసుకున్నాడు కార్తికేయ. అతడి బాధ ప్రస్తుతం కాస్త తగ్గింది. దానికి కారణం ఆ తరువాతి రోజు జరిగిన సంఘటన.

భార్య అతడిని బొమ్మ వేయటానికి ఒప్పించినప్పుడు అతడు బాధపడిన మాట నిజమే. 'నేను మిమ్మల్ని ప్రేమించటం లేదు' అన్నప్పుడు హృదయంలో పర్వతాలు బ్రద్దలైన మాట కూడా నిజమే. కానీ, ఆ మరుసటిరోజు ప్రొద్దున జరిగిన మరో సంఘటన, మానవ సంబంధాల గురించి అతడికి మరో అధ్యాయాన్ని తెరిచి చూపించింది.

తెల్లవారురుఝామున అయిదింటికి ఫోన్ వచ్చింది. అటువైపు ఉస్మాన్. ''ఏమిటి భాయ్? ఇంత ప్రొద్దున్నే చేశావ్?'' కార్తికేయ నిద్రమత్తులోనే అడిగాడు.

''రాత్రి దీదీని ఆస్పత్రిలో చేర్పించాం. కడుపు నొప్పి మళ్ళీ తిరగబెట్టింది'' అన్నాడు ఉస్మాన్. 'దీదీ' అంటే ఒకప్పటి గది యజమాని భార్య. కార్తికేయ పక్క మీద నుంచి చప్పున లేస్తూ, ''మైగాడ్ నేనిప్పుడే వస్తున్నాను'' అన్నాడు.

అట్నుంచి కాస్త తటపటాయింపు. ''డాక్టర్ ఆపరేషన్‌కి పదివేలు కావాలన్నాడు భాయ్.''

''మరి రాత్రే చెప్పలేదేం?'' నిష్టూరంగా అన్నాడు.

''చేర్పించగానే నేను మీ ఇంటి కొచ్చాను భాయ్. అంత రాత్రి గూర్ఖా లోపలికి రానివ్వలేదు.''

అంతస్తు పెంచిన అంతరాన్ని మౌనంగా స్వీకరిస్తూ ''నేనొస్తున్నాను ఉస్మాన్'' అని ఫోన్ పెట్టేశాడు. అతను ఆస్పత్రికి వెళ్ళేసరికి ముసలి యజమాని వరండాలో దిగులుగా కనబడ్డాడు. అతడి ఆరుగురు కూతుళ్ళూ, ఇద్దరు కొడుకులూ బిక్క మొహాల్తో ఉన్నారు. పదహారేళ్ళ పెద్ద కూతురు ఏడుస్తూ 'భయ్యా అమ్మ బ్రతుకుతుంది కదా' అంది రుద్ధకంఠంతో.

కార్తికేయ లోపలికి వెళ్ళి డాక్టర్‌తో మాట్లాడాడు. అతడెవరో తెలిశాక ఏర్పాట్లన్నీ చకచకా జరిగి పోయాయి. ఆమెని థియేటర్‌లోకి తీసుకువెళ్ళాక, కార్తికేయ ఉస్మాన్‌తో కలిసి దూరంగా వేపచెట్టు క్రింద ఉన్న టీ దుకాణం దగ్గరకి నడిచాడు. చాలా రోజుల తరువాత మళ్ళీ అలాంటి దుకాణంలో 'టీ' త్రాగడం గమ్మత్తయిన అనుభూతి..! చలికి శరీరం సన్నగా వణుకుతోంటే, కోటు నిండుగా కప్పుకుంటూ, ''మనం ఇలా 'టీ' త్రాగి, చాలా రోజులైంది కదూ ఉస్మాన్'' అన్నాడు.

అప్పటివరకూ ఒక నిశ్శబ్దపు కోటలో ఉన్న ఉస్మాన్ ఒక్కసారిగా బ్రద్దలైనట్టు ''నువ్వు వస్తావో, రావో అని చాలా భయపడ్డాను భాయ్. నిన్న రాత్రి మీ గూర్ఖా నన్ను అంతగా భయపెట్టేశాడు'' అన్నాడు. అంత తెల్లవారుజామునే కార్తికేయ వచ్చి అలా ఆదుకోవటం అతడికి సంభ్రమంగానూ, ఉద్విగ్నంగానూ ఉంది.

ఉస్మాన్‌తో మాట్లాడుతున్నంత సేపు కార్తికేయ ఆలోచిస్తూనే ఉన్నాడు. టీ తాగి, ఆలస్యం చేయకుండా చేతికందిన పెయింటింగ్స్ మూడు తీసుకుని గిరిధర్‌లాల్ చమన్ దగ్గరకి వెళ్ళాడు.

గిరిధర్‌లాల్ విలువైన పాత సామాగ్రి, చిత్రాలు, శిల్పాలు కొని అమ్ముతూ ఉంటాడు. అవి చూడటానికి కార్తికేయ అప్పుడప్పుడు వెళ్ళేవాడు. ఆ రకంగా పరిచయం. ''ఆయియేసాబ్ చెప్పండి'' ఆహ్వానిస్తూ అన్నాడు గిరిధర్‌లాల్.

''ఒకటి రెండు చిత్రాలు అమ్మటానికి వచ్చాను'' అని, వాటిని చూపించాడు. గిరిధర్‌లాల్ వాటిని పరీక్షగా చూసి, ''ఐదు వేలు ఇస్తాను సాబ్'' అన్నాడు.

''ఐదు వేలా'' కార్తికేయ విస్మయంగా అన్నాడు.

గిరిధర్‌లాల్ కూడా నిస్పృహగా నవ్వి, ''కృత్రిమమైన పెయింటింగ్స్ వచ్చాక ఈ మధ్య వీటికి డిమాండ్ తగ్గిపోయింది సాబ్. రెండు వేలు చెప్తే కస్టమర్లు తిరిగి వెళ్ళిపోతున్నారు'' అన్నాడు. కార్తికేయకి శ్రీకళ్యాణితో ఒకప్పుడు జరిగిన సంభాషణ గుర్తొచ్చింది. మొత్తం ఆస్తంతా ఇచ్చినా అమ్మననటం గుర్తొచ్చి నవ్వొచ్చింది.

అంతలో గిరిధర్‌లాల్ దృష్టి, కార్తికేయ రెండో చేతిలో ఉన్న చిత్రం మీద పడింది. దాన్ని చేతుల్లోకి తీసుకుని చూస్తూ... అలాగే ఉండిపోయాడు. అతడి నోటి వెంట అప్రయత్నంగా "అ ... అద్భుతం'' అన్న మాట వినిపించింది. అతడు నూరుశాతం వ్యాపారవేత్త కాదు. తన సంభ్రమాన్ని దాచుకునే ప్రయత్నం ఏమీ చేయలేదు.

''దీనికైతే ఐదువేలిస్తాను సాబ్'' అన్నాడు.

తన ఆర్తికి... ఒకమ్మాయి హృదయం లోంచి పెల్లుబికిన స్ఫూర్తి రంగరించి... కొంకర్లు పోయిన వేళ్ళకీ– చీలిన చర్మపు గీతలకి సమన్వయం కుదిర్చి... నిరంకుశితమైన దీక్షతో, నిర్విరామమైన కష్టంతో వేసిన బొమ్మకి 'ఐదువేలా?' అనుకోలేదు కార్తికేయ. ఆ బొమ్మ వైపు అభావంగా చూస్తూ ''అవి రంగులు కావు గిరిధర్‌జీ! రక్తం కలిసిన స్వభావ సిద్ధమైన నూనె. ఎక్కువ కాలం నిలబడకపోవచ్చు'' అన్నాడు.

''ఫర్వాలేదు. దీన్ని నేను అమ్మను. ఇంట్లో తగిలిస్తాను.''

...అతని దగ్గర డబ్బు తీసుకుని ఆస్పత్రికొచ్చి బిల్లు చెల్లించాడు కార్తికేయ. వరండా లోంచి నడుస్తూండగా దీదీ భర్త పరుగెత్తుకు వచ్చాడు. ఆ వృద్ధుడి మొహం ఆనందంతో వెలిగిపోతోంది. కార్తికేయ చేతులు పట్టుకుని ఉర్దూలో అన్నాడు. ''పేగులు మెలికబడి ఉన్నాయట బాబూ. ఈ నాలుగు సంవత్సరాల బాధకీ అదీ కారణమట. ఇప్పుడు సరిచేశారుట. జీవితం మొత్తం మీద ఇక ఆ బాధ ఉండదట'' అన్నాడు ఉద్వేగంగా.

ఏ కుంచె కూడా సృష్టించ లేని ఆనందవర్ణాలు ఆ ఎనిమిదిమంది పిల్లల్లో తాండవిస్తూండగా కార్తికేయ ''నీతో కలిసి చిత్రించిన ఆ బొమ్మని అమ్ముతున్నప్పుడు నా మనసులో ఏ మూలైనా బాధ ఉంటే అది ఈ క్షణం పోయింది. నీ రక్తానికీ, నా శ్రమకీ ఇంతకన్నా శాశ్వతత్వం ఎక్కడ లభిస్తుంది. అనూజ్ఞా?'' అని మనసులో అనుకున్నాడు.

అనుభవమే మనిషి జీవితంలో కొత్త కోణాల్ని తెరుస్తుంది. కొత్త వెలుగుల్ని ప్రసరింప జేస్తుంది. ఆ కుటుంబపు ఆనందానికి ప్రత్యక్ష సాక్షిగా అతను అలా అనుకుంటున్న సమయంలో అతడిలో మరో కొత్త కోణం తెరుచుకుంది.

ప్రస్తుత ఆలోచనకి వ్యతిరేక దృక్పథంలో పాజటివ్‌గా ఆలోచించిస్తే ఎవరి తప్పూ కనబడదు. కేవలం అవతలి వారి నైజాలూ, సిద్ధాంతాలూ, అభిప్రాయాలే కనపడతాయి. నమ్మిన సిద్ధాంతం కోసం భార్యని అమ్మిన హరిశ్చంద్రుడు గొప్పవాడైతే, నమ్మిన సిద్ధాంతం కోసం భర్త కాలాన్నీ, కళనీ మినిస్టర్ కి అమ్మిన శ్రీకళ్యాణి గొప్పదే. అయితే చరిత్రలో హరిశ్చంద్రుడికి ఉన్న స్థానం చంద్రమతికి లేదు. అయితే చంద్రమతి చరిత్ర కోసం చేయలేదు. తన భర్త కోసం చేసింది. ఏ కవి అయినా ఆమె మనసులోకి తరచి తొంగిచూస్తే భర్తకి సాయం చేస్తున్నానన్న తృప్తే కనబడుతుందేమో.

తన చిత్రాలు అమూల్యాలని అతడు ఒకప్పుడు అనుకున్నాడు. అవి ఒక బీద కుటుంబపు వదనాల మీద ఆనందరాగాలు పలికిస్తూ ఉంటే వాటి అసలు 'ఖరీదు' తెలిసింది.

'అదే ఆనందం శ్రీకళ్యాణికి కూడా కలిగించితే తనకి సంతోషమే కదా!' అని అతను ఇప్పుడు భావించాడు. ఈ రకమైన ఆలోచన కలిగాక అతడిలో ఉదాసీనత పోయింది. వెళ్లి బొమ్మ వేయటానికి తయారయ్యాడు.

'దీదీ' ఆ రకంగా అతడికి సాయం చేసింది.

2

బంగాళాఖాతంలో దాదాపు మూడువందల దీవులు. వాటిలో ఇరవై నికోబార్. మిగతావి అండమాన్. మద్రాసుకి దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ద్వీపాల్లో మాయర్ బందర్, నాన్ కౌరీ, దక్షిణ అండమాన్‌లని తీసేస్తే మిగతావి చిన్న చిన్న దీవులు. ఈ ద్వీపాల మధ్యనున్న సముద్రాన్ని డిగ్రీ కాలువ అంటారు. డిగ్రీ కాలువ గుండా వాళ్ళ బోటు దాదాపు గంట ప్రయాణించి, మాయర్ బందర్ దాటిన తరువాత మరింత దక్షిణానికి తిరిగి చిన్న దీవుల వైపు వెళ్ళింది.

కొన్ని ద్వీపాల్లో వ్యవసాయం ప్రారంభమైంది. ప్రాచీన నిగ్రిటో సంతతి ఆదిమ వాసులు కూడా జన స్రవంతిలో కలిసిపోయారు. అందమైన ఈ దీవుల్లో కొందరు ప్రముఖులు పెద్ద పెద్ద భవంతులు కొన్ని కట్టారు. సెలవు విడిదుల్లా వాటిని ఉపయోగిస్తారు. కలప, రబ్బరు చెట్లమధ్య ఈ దీవులు, భవంతులు అందానికీ ఆహ్లాదానికీ పుట్టినిళ్ళు.

వాళ్ళబోటు దీవి చేరుకుంది. వంద ఎకరాల దీవిలో పచ్చని చెట్ల మధ్య పావురంలాంటి తెల్లటి రాజభవనం లాంటి ఇల్లు. చుట్టూ ప్రహరీ గోడ. బొంబాయిలోని పెద్ద వజ్రాల వర్తకుడిదని చెప్పాడు గైడ్. ఆ వర్తకుడు మినిస్టర్ వివేకానందకి దగ్గర స్నేహితుడట.

దూరం నుంచి వచ్చే సముద్రపు హోరులో గుర్తు తెలియని వింత పక్షుల స్వరాలు కలిసి అదో వింత రకంగా వినిపిస్తున్నాయి. అది తప్ప మిగతా అంతా ప్రశాంతంగా ఉంది. వాళ్ళు పది నిముషాలు నడక సాగించి ఆ భవంతికి చేరుకున్నారు. ఎత్తయిన ప్రహరీగోడ తాలూకు విశాలమైన తలుపు తీసి గూర్కా సెల్యూట్ చేశాడు. లోపలికి అడుగు పెట్టగానే కార్తికేయ లాంటి నిర్వేదుడు కూడా అక్కడి అరిస్టోక్రసీని, అందాన్నీ చూసి ఒక క్షణం దిగ్భ్రమ చెందాడు. కృత్రిమమైన జలపాతం, రంగు రంగుల పూలమొక్కలు, తివాచీ లాంటి పచ్చటి గడ్డి, మధ్యలో అందమైన ఫౌంటెన్లు.

భవనంలోకి ప్రవేశించటానికి పొడవాటి మెట్లు దాదాపు ఇరవై దాకా ఉన్నాయి. తరువాత విశాలమైన వరండా, స్థంభాల పక్కనే అందమైన పాలరాతి విగ్రహాలు. అది వజ్రాల వ్యాపారి వసతి గృహంలా లేదు. వజ్రాలు కరిగించి కట్టిన ఇల్లులా ఉంది.

వరండా తరువాత దాదాపు పన్నెండు అడుగుల ఎత్తున ముఖద్వారం ఉంది. చక్కటి వెల్వెట్ కర్టెను రెండుగా చీలి లోపలికి ఆహ్వానం పలుకుతోంది. కార్తికేయ లోపలికి అడుగు పెడుతుండగా ''వెల్‌కమ్. వెల్‌కమ్ టు ది గ్రీన్ ఐలాండ్'' అని ఒక మృదు మధుర స్వరం వినిపించింది.

అనూజ్ఞ నిలబడి నవ్వుతోంది.

3

సాయంత్రం అయింది. జలపాతం పక్కనే టెన్నిస్ కోర్టు దగ్గర కుర్చీల్లో కూర్చుని 'టీ' త్రాగుతున్నారు కార్తికేయ, వివేకానంద. అనూజ్ఞ చేపలు పట్టడం కోసం వెళ్ళింది.

''ఎలా ఉంది ఇక్కడ'' వివేకానంద అడిగాడు.

''ఇక్కడ అందాన్నీ, ఖరీదునీ చూస్తుంటే భారతదేశం రోజు రోజుకీ ఎందుకు బీదదవుతోందో తెలుస్తోంది.''

వివేకానంద నవ్వాడు. ''నా స్నేహితుడిది. అయిదారు నెలల పాటు మనకి ఇచ్చాడు. ఇక్కడ ఏ విధమైన గొడవా ఉండదు. ఏ వస్తువు కావాలన్నా పోర్టుబ్లెయిర్‌కి వెళ్ళి తెచ్చుకోవాల్సిందే. నీ సామాన్లూ, రంగులూ, కుంచెలూ అన్నీ తెచ్చుకున్నావ్‌గా?''

''తెచ్చుకున్నాను.''

''నేను రేప్రొద్దున్నే ఢిల్లీ వెళ్ళిపోతున్నాను. అనూజ్ఞ ఇక్కడే ఉంటుంది.''

యథాలాపంగా వింటున్న కార్తికేయ ఛివుక్కున తలెత్తాడు. అప్పటి వరకూ అస్పష్టంగా ఉన్న సంశయం ఏదో నెమ్మదిగా రూపుదిద్దుకుంటున్నట్టు అనిపించి, ''అ...నూ... జ్ఞా'' అన్నాడు.

''అవును. ఈ నాలుగు నెలలూ.''

''ఒద్దు'' వెంటనే చెప్పాడు. ''ఆమె ఎందుకు నాతో?''

‘‘తనే ఉంటానంది. ఒకరకంగా చెప్పాలంటే ఇదంతా తన ఏర్పాటే. ఎలాగైనా నీతో ఒక మంచి బొమ్మ వేయించటం.’’

మనసులో భావాలు మొహంలో కనబడకుండా జాగ్రత్తపడుతూ ‘‘ఉద్దేశం మంచిదే కానీ దానికి తాను నాతోపాటూ ఈ దీవిలో ఒంటరిగా ఉండటం అనవసరం’’ అన్నాడు కటువుగా.

‘‘ఒంటరిగా ఎందుకుంటుంది? ఇంతమంది నౌఖర్లుంటే.’’

‘‘నే మాట్లాడుతున్నది మీకు అర్థమై కూడా కానట్టు చెపుతున్నారు.’’

వివేకానంద జవాబు చెప్పలేదు.

‘‘అనూజ్ఞకి నాతో బొమ్మ వేయించాలన్న కోరిక ఉన్నట్టు నాకు తెలుసు వివేకానంద గారూ. మరణశయ్య మీద ఉన్నట్టు నటించినప్పుడు కూడా ఇదే వాగ్దానం తీసుకుంది. కానీ ఒక తండ్రిగా అంతకన్నా ముఖ్య విషయం– మీరు తెలుసుకోవలసింది ఒకటుంది.’’

‘‘ఏది? నీకు వివాహమైందనీ– ఇలా పెళ్ళికావలసిన ఆడపిల్లని నీతో ఒంటరిగా వదిలిపెట్టకూడదనీ...’’

‘‘అవును. అందుకే నేనూ, నా భార్యా సంతకం చేసినట్టు ఒక పుస్తకాన్ని ఆమెకు బహుమతిగా ఇచ్చాను’’ అంటూన్న అతడి మాటలు పూర్తి కాకుండానే వివేకానంద అడ్డు తగులుతూ ‘‘ఆ సంతకం చేసిన పేజీ నేను చింపేసాను’’ అన్నాడు.

కార్తికేయ అదిరిపడి ‘‘ఎందుకు?’’ అన్నాడు.

‘‘మరణానికి చేరువలో ఉన్న నా కూతురికి ఆ విషయం తెలియటం ఇష్టంలేక.’’

సూర్యుడు పూర్తిగా దిగిపోవటంతో అక్కడ చీకట్లు కమ్ముకున్నాయి. ఒక్కసారిగా సముద్రం మీద గాలి దిశ మారింది. చుట్టూ సముద్రమే ఉండటం వల్ల దీవి మీద ఉన్న చరాచరాలు అన్నింటినీ తుడిచి పెట్టెయ్యాలని కంకణం కట్టుకున్నట్టు గాలి ఉధృతంగా వీస్తోంది. ఆ చలి వణికించిందో, వివేకానంద మాటలోని నిజం వణికించిందో తెలీదుకాని అతడు నిలువెల్లా కంపిస్తున్నాడు. ఆమె చెప్తే నమ్మేవాడు కాదు. కానీ తండ్రి చెపుతున్నాడు...! అసలా విషయం వినగానే అతడి మెదడు ఆలోచించే శక్తి కోల్పోయింది.

అటువంటి విచక్షణారహిత స్థితిలో అతనుండగా వివేకానంద చెప్పటం కొనసాగించాడు. ‘‘అనూజ్ఞకి హడ్జ్కిన్స్ డిసీజ్. ఏ బాధ లేకుండా మన నుంచి వెళ్ళిపోతుంది. అంతవరకూ అదృష్టవంతురాలు. నీకు అనిపించవచ్చు. ఇలాంటి వార్త విని కూడా నేను మామూలుగా ఎలా ఉండగలుగుతున్నానని. అవును. ఉంటున్నాను. కారణం ఈ విషయం నా కూతురికి తెలియటం ఇష్టంలేక! మరణం తప్పనప్పుడు దాన్ని ముందే ఆమెకి చెప్పి మనసుని కూడా చంపటం దేనికి? ఆ వ్యాధికి మందు కూడా లేదట. ప్రశాంతంగా ఉండటం కోసం ఈ దీవికి తీసుకొచ్చాను. తీసుకు వచ్చే ముందే ‘ఆ అమ్మాయి నీ ప్రేమలో ఉందని’ నాకు తెలిసింది. నీ మీద విపరీతమైన కోపం వచ్చింది. కానీ వివరాలు తరువాత తెలిశాక, నీ మీద

విపరీతమైన గౌరవం పెరిగిపోయింది. నీ వ్యక్తిగత వివరాలు ఆమెకు చెప్పలేదు. చెప్పి తనని బాధపెట్టటం ఇష్టం లేకపోయింది. నువ్వు బొమ్మ వేస్తావో వెయ్యవో నీ ఇష్టం. నాక్కావాల్సిందల్లా నా కూతురు మరణించే వరకూ నువ్వు ఇక్కడ ఉండటం. ఆమెని సంతోషంగా ఉంచటం. అలా ఉంచటం కోసం నీ భార్య ప్రసక్తి ఆమె దగ్గర తేకపోవడం. ఇప్పుడు చెప్పు నీ అభిప్రాయం'' అంటూ వెనక్కి చూసి ఆగిపోయాడు.

కార్తికేయ అక్కడ లేడు.

★ ★ ★

సముద్రంలో నెమ్మదిగా లేస్తూ ప్రారంభమైన ఒక వయ్యారి కెరటం, అందంగా బయల్దేరి, ఆకర్షిస్తూ దగ్గరకొచ్చి, ఊహించని ఎత్తుకి పెరిగి, పెద్ద శబ్దంతో తిరిగి విరిగి అదృశ్యమై పోయినట్లు– ఒక స్నేహం ఒక స్వప్నంలా చెదిరి, ఒక అందం ఒక భూకంపంలో కరిగిపోతోంది.

అతడు సముద్ర తీరాన నిలబడి చూస్తున్నాడు. అతడి మెదడులో, మనసులో, సర్వాంగాల్లో సముద్ర ఘోషే. ఆమె ఉండదని తెలిసేసరికి ఆమె ఉండడంలో ఉన్న విలువ తెలుస్తోంది.

వెళ్ళిపోయిన తరువాత 'గతం' విలువ తెలుస్తుందంటారు. ఉంటూ, ఇక ముందు ఉండదన్న 'వర్తమానం' అంత కంటే బాధాకరమైంది.

దూరం నుంచి ''మిత్రాజీ'' అని వినిపించింది. అతడు తల తిప్పి చూశాడు. అనూజ్ఞ. దాదాపు పరిగెడుతున్నట్లు దగ్గరకొచ్చింది. ''ఇక్కడేం చేస్తున్నారు?''

అతడు సమాధానం చెప్పలేదు.

''మీరిక్కడికి రాగానే ముందో పదినిముషాలు తనకి వదిలిపెట్టమన్నారు నాన్నగారు. అందుకే నేను ఫిషింగ్‌కి పోయాను. మంచి చేప దొరికిందిగానీ పాపం గిలగిలా కొట్టుకుంటూంటే వదిలి పెట్టేశాను. ఏమన్నారు నాన్నగారు?''

అనూజ్ఞకన్నా ముందు ఆయన తనతో ఎందుకు మాట్లాడాలనుకున్నాడో అర్థమైంది.

ఆమె అతని దగ్గరగా వచ్చి అతడి మొహంలోకి అమాయకంగా చూస్తూ ''నా మీద కోపంగా ఉంది కదూ. నాన్నగారికి అంతా చెప్పేశాను. 'కావాలంటే కాబోయే అల్లుడి గురించి ఎంక్వయిరీ చేసుకో నాన్నా' అన్నాను. ఒక్కసారి మీ గురించి తెలిస్తే ఏ తండ్రీ కాదనడని తెలుసు'' అని నవ్వి మళ్ళీ అన్నది. ''అన్నట్లు నేనొక నిర్ణయం తీసుకున్నాను. ఈ నాలుగు నెలలూ అల్లరి చేసి మిమ్మల్ని డిస్టర్బ్ చేయకూడదని. నా నిర్ణయం బావుందా?''

''ఎంత వద్దనుకున్నా నన్ను డిస్టర్బ్ చేస్తూనే ఉంటావు అనూజ్ఞా.''

''అంతేనంటారా? అవున్లెండి. మన రక్తంలోనే ఉందది. అన్నట్టు రక్తం అంటే గుర్తొచ్చించి. మొన్న నాన్నగారితో కలిసి ఆయన పరీక్షల కోసం ఆస్పత్రికి వెళ్ళాను. అక్కడో డాక్టర్ తగిలాడు. పేరేమిటో తెలుసా? పి.టి.లాల్. *జబ్ ప్యార్ కిసీసే*

హోతాహై చూశారా? అందులో రాజేంద్రనాథ్ పేరు అదే. పపట్‌లాల్. ఈ డాక్టర్ కూడా అలాటి వాడే. నాకూ పరీక్షలు చేస్తానన్నాడు. చేశాడు కూడా. చేసి...''

అతడు వినడానికి ఇష్టం లేనట్టే ''ఆ పుస్తకం ఏమిటి?'' అంటూ ప్రసక్తి మార్చాడు. ఆమె తన చేతిలోని పుస్తకం వంక చూసుకుని ''మీరు పంపిందే. అన్నట్లు నేను పంపిన వీడియో క్యాసెట్ అందిందా?'' అని అడిగింది. అతడు దానికి సమాధానం చెప్పకుండా చప్పున ఆమె చేతిలో పుస్తకం తీసుకుని మొదటి పేజీ తిప్పాడు. అతడు సంతకం చేసిన కాగితం చింపబడి వుంది.

అతడి ఆతృతని ఆమె మరోలా అర్థం చేసుకుని ''మీరు చదివారా ఈ పుస్తకాన్ని'' అని అడిగింది.

''లేదు. నువ్వెప్పుడో మాటల సందర్భంలో 'గీతాంజలి' ప్రసక్తి తీసుకొస్తే, పుస్తకాల షాపుకి వెళ్ళినప్పుడు కనబడి తీసుకొచ్చాను.''

''దీని వెనుక కథ తెలుసా మీకు? అదే... ఈ గీతాంజలి అనే అమ్మాయి కథ.''

''తెలీదు. ఏమిటి?''

''కలకత్తా టీ తోటల యజమానీ, కోటీశ్వరుడూ అయిన గార్డెన్ ఫాక్స్‌కి ఓ రోజు బోంబే సముద్రతీరం ఇసుకలో ఇలస్ట్రేటెడ్ వీక్లీ కాగితం ఒకటి కాలికి తగిలింది. అందులో ఆంగ్ల గేయం చదివి, అతడు కదిలిపోయి ఆ పత్రిక సంపాదకుడు ప్రీతీష్ నందికి కబురు చేశాడట. ఈ గేయం తాలూకు వెనుక కథ ఎడిటర్ చెప్పాడు.

అతడి దగ్గరకి ఒకావిడ ఆ గేయం తీసుకొచ్చి ప్రచురించమని కోరిందట. అది అద్భుతంగా ఉండటంతో 'అది ఎవరు వ్రాశారు?' అని అడగ్గా 'పదహారేళ్ళ వయసులో చనిపోయిన తన కూతురు వ్రాసింద'ని చెప్పిందట. అతడు దాన్ని ప్రచురించాడు. ఆ గేయానికి గొప్ప స్పందన లభించటంతో, ఆ తరువాత ఇంట్లో వెతికితే తల దిండు గలీబుల్లో, పుస్తకాల మడతల్లో, సోఫా వెనుకా, చిన్న చిన్న కాగితాల మీద వ్రాసిన చాలా గేయాలు దొరికాయట. అన్నీ కలిపి పుస్తకంగా వేశాడట ఫాక్స్ . అదే ఈ పుస్తకం గీతాంజలి. ఆ అమ్మాయి పేరు కూడా గీతాంజలే" చెప్పటం క్షణం ఆపి కొనసాగించింది. "...తను చనిపోతున్నట్లు ఆ అమ్మాయి ఒక్క దానికే తెలుసు. తల్లికీ, తండ్రికీ, ఇంట్లో మరెవరికీ తెలీదు. దిగులు పంచుకునే వారెవరూ లేక, బాధ భరించలేక ఇలా నిశ్శబ్దపు అర్ధరాత్రుల్లో ఒంటరిగా గేయాలు వ్రాసి దాచుకునేదన్న మాట.''

కార్తికేయ విచలితుడై చూస్తుండగా కొనసాగించింది. ''చిన్న అమ్మాయి... చాలా చిన్న అమ్మాయి... జీవితం పట్ల ఎంతో ప్రేమ ఉన్న అమ్మాయి... తన నుంచి జీవితం దూరంగా వెళ్ళిపోతోంటే చూస్తూ ఉండిపోయిన పదారేళ్ళ అమ్మాయి... 'దేవుడెవరైనా కానీ, మతం ఏదైనా కానీ, బాధ మాత్రం ప్రపంచంలో అందరిదీ ఒకటే' అని ఈ గీతాంజలి అన్న పుస్తకం ద్వారా చిన్న చిన్న పదాల్లో మనకు చెబుతుంది.''

కార్తికేయ ఆమె వైపు చూస్తున్నాడు. ఆమెయితే అభావంగా చెపుతోంది కానీ తన మనస్సులో సంఘర్షణనీ, సంచలనాన్ని అణచుకోవడానికి అతను చాలా కష్టపడవలసి వచ్చింది.

''మీరు బొమ్మ వేస్తున్నంతకాలం నేనేం చెయ్యను? అందుకని ఈ లోపులో నేనీ గేయాల్ని తెలుగులోకి తర్జుమా చేస్తాను. తెలుగులో కూడా దీనికో సార్థకత సమకూరుస్తాను'' అని చేతిలో కాగితం అతనికిస్తూ, ''మచ్చుకి ఒకటి అనువదించాను. ఎలా ఉందో చూడండి'' అంటూ అందించింది. తన చేతుల కంపనం ఆమెకి తెలియకుండా జాగ్రత్త పడుతూ అతను ఆ కాగితాన్ని తీసుకుని చదివాడు.

నిద్రా ఓ నిద్రా.
మనిద్దరం ఎప్పుడు కలుసుకున్నాం?
నువ్వూ నేనూ మరీ ఎంత అపరిచితులమైపోయాం!
ఒకప్పుడు నువ్వు నాకెంత మంచి స్నేహితురాలివి!
చీకటి పడగానే చెయ్యి పట్టుకు తీసుకెళ్ళేదానివి.
నీ రాజ్యంలో... దూరపు కొండల నిశ్శబ్దంలో
నేనో కలల సౌధం నిర్మించుకునే దానిని.
ఉదయం కాగానే మెలకువ ప్రపంచంలోకి తిరిగి తీసుకొచ్చేదానివి.
మరిప్పుడో? కలలు లేవు. జ్ఞాపకాలే.
గుడ్నైట్ చెప్పి నుదుటి మీద ముద్దుపెట్టుకుని అమ్మ వెళ్ళిపోయాక
నిశ్శబ్దంగా నీ కోసం చీకట్లోకి నిరీక్షిస్తూ ఉంటాను.
ఎప్పుడో అతి తొందర్లో ... నీ పాత స్నేహితురాల్ని ఆఖరిసారి కలుసుకోవడం కోసం
ఒకే ఒకసారి నువ్వొస్తావని తెలుసు. అప్పుడిక కలలుండవు.
అంతా నిద్రే.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments